

రుద్రంగిలో ప్రధాన రాహదారి వెంబడి కమ్ముకున్న పొగమంచు

## కమ్ముకున్న పొగమంచు

*రుద్రంగి మండలంలో శనివారం తెల్లవారుజామున దట్టమైన పొగమంచు కమ్మేసింది. ప్రధాన రహదారి వెంబడి వెళ్తున్న వాహనదారులు, గ్రామస్తులు బయటికి వెళ్లేందుకు ఇబ్బందిపడ్డారు. వాహనదారులు ఉదయం 8గంటల వరకు కూడా లైట్లు వేసుకొని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది.*

**- రుద్రంగి, డిసెంబర్ 9**




ఆర్‌జేసీకి స్వామివారి ప్రసాదాన్ని అందజేస్తున్న ఆలయ ఏఈవో

## రాజన్న సన్నిధిలో దేవాదాయశాఖ ఆర్‌జేసీ

వేములవాడ టౌన్, డిసెంబర్ 9: కార్తీక మాసం సందర్భంగా వేములవాడ శ్రీ పార్వతీ రాజరాజేశ్వర స్వామివారిని దేవాదాయశాఖ రీజినల్ జాయింట్ కమిషనర్ రామకృష్ణ కుటుంబ సమేతంగా శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నాగిరెడ్డి మండపంలో అర్చకులు ఆశీర్వదించగా, ఏఈవో ప్రతాప నవీన్ వారికి స్వామివారి ప్రసాదం అందించారు. ఇక్కడ ఆలయ ప్రొటోకాల్ పర్యవేక్షకులు సిరిగిరి శ్రీరాములు, అల్లి శంకర్, ఇన్‌స్పెక్టర్ అశోక్ ఉన్నారు.

## వట్టెంలలో గంజాయి పట్టివేత




వివరాలు వెల్లడిస్తున్న వేములవాడ రూరల్ సీఐ కృష్ణకుమార్

వేములవాడ రూరల్, డిసెంబర్9: వేములవాడ రూరల్ మండలం వట్టెంల పరిధిలో గంజాయి రవాణా చేస్తున్న ఒకరిని అరెస్ట్ చేసినట్లు వేములవాడ రూరల్ సీఐ కృష్ణకుమార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఒడిశా రాష్ట్రానికి చెందిన కామటి కారా గంజాయి సరఫరా చేస్తున్నారనే సమాచారంతో వట్టెంల వద్ద తనిఖీలు చేయగా, అతడి వద్ద ఐదు కిలోల గంజాయి లభ్యమైందన్నారు. వేములవాడ డిప్యూటీ తహసీల్దార్ ఎదుట పంచనామా నిర్వహించి కేసు నమోదు చేసి రిమాండ్‌కి తరలించినట్లు తెలిపారు. యువత గంజాయికి అలవాటు పడి, తమ బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దన్నారు. గంజాయి సరఫరాకు సంబంధించిన సమాచారం ఉంటే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

## కోరుట్లలో స్వచ్ఛ టాయిలెట్ క్యాంపెయిన్

కోరుట్ల, డిసెంబర్ 9: స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 25 వరకు నిర్వహించే క్లీన్ టాయిలెట్ క్యాంపెయిన్ కార్యక్రమాన్ని కోరుట్ల పట్టణంలో మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గాభవానీ మహిళా పొదుపు సంఘానికి చెందిన మహిళలు పబ్లిక్ టాయిలెట్ పరిసర ప్రాంతాలను శుభ్రం చేసి, ముగ్గులతో అలంకరించారు. కోరుట్ల పట్టణ, పరిసర ప్రాంతాల ప్రజలు పబ్లిక్ టాయిలెట్లను ఉపయోగించుకుని పట్టణాన్ని బహిరంగ మలమూత్ర విసర్జన లేని పట్టణంగా తీర్చిదిద్దేందుకు సహకరించాలని వారు కోరారు.

# ‘మహాలక్ష్మి’ని సద్వినియోగం చేసుకోవాలి

- కలెక్టర్ అనురాగ్ జయంతి
- మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభం
- చేయూత పథకంలో భాగంగా ఆరోగ్యశ్రీ సేవలు ₹10లక్షలకు పెంపు




అంబేద్కర్ చౌరస్తాలో జెండా ఊపి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 9 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ప్రభుత్వం రాజీవ్ ఆరోగ్యశ్రీని ₹5లక్షల నుంచి ₹10లక్షలకు పెంచడం ద్వారా పేద కుటుంబాలకు ఎంతో మేలు జరుగుతుందని కలెక్టర్ అనురాగ్ జయంతి పేర్కొన్నారు. సిరిసిల్ల ఏరియా దవాఖానలో ఆరోగ్యశ్రీ ₹10 లక్షలకు పెంచే చేయూత పథకాన్ని, పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో మహలక్ష్మీ పథకంలో మహిళలకు కల్పించిన ఉచిత ప్రయాణ సౌకర్యంలో భాగంగా జెండా ఊపి ఆర్టీసీ బస్సును మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళతో కలిసి శనివారం ప్రారంభించి, మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకంలో భాగంగా ఒక్కో కుటుంబానికి ₹5లక్షల నుంచి ₹10లక్షల వరకు వైద్య సదుపాయం కల్పిస్తున్నదని చెప్పారు. వైద్య సేవలు అన్ని దవాఖానలో ఉచితంగా లభిస్తాయని చెప్పారు. ఈ పథకం ద్వారా జిల్లాలో 1,73,974 మందికి లబ్ధి చేకూరుతుందని తెలిపారు. అలాగే మహలక్ష్మీ పథకంలో భాగంగా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం ద్వారా మహిళలకు ఆర్థిక భారం తగ్గుతుందన్నారు. మహిళలతో కలిసి అంబేద్కర్ చౌరస్తా నుంచి రగుడు వరకు బస్సులో ప్రయాణించారు. ఇక్కడ జిల్లా రవాణాశాఖ అధికారి కొండల్‌రావు, డీఎంహెచ్‌వో డాక్టర్ సుమన్‌మోహన్‌రావు, ఏరియా దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ మురళీధర్‌రావు, ఆర్ఎంవో సంతోష్, ఆరోగ్యశ్రీ టీం లీడర్ తిరుపతి, ఆర్టీసీ డిపో మేనేజర్ మనోహర్, కాంగ్రెస్ నాయకులు కేకే మహేందర్‌రెడ్డి, గడ్డం నర్సయ్య, గోలి వెంకటరమణ, కాముని వనిత, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

***ఇల్లంతకుంటలో..***

ఇల్లంతకుంట, డిసెంబర్ 9: మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని కాంగ్రెస్ నాయకులు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళలు బస్సుల్లో ఉచితంగా ప్రయాణించారు.



సిరిసిల్ల ఏరియా దవాఖానలో చేయూత పథకాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి




ఇల్లంతకుంట: మండల కేంద్రంలో ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

## దివ్యాంగులను విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం

జగిత్యాల రూరల్, డిసెంబర్ 9: ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన విధంగా దివ్యాంగులకు ఉచిత బస్ ప్రయాణం, రూ.6వేలు పింఛన్ ఇవ్వకపోవడం దివ్యాంగులను విస్మరించడమేనని ఆ సంఘం నాయకులు విమర్శించారు. శనివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. దివ్యాంగురాలికి ఉద్యోగ భద్రత కల్పిస్తామని చెప్పి కాంట్రాక్ట్ పద్ధతిలో ఉద్యోగం ఇవ్వడం బాధాకరమన్నారు. మహిళలకు ఎలాగైతే ఉచిత ప్రయాణం కల్పిస్తున్నారో అలాగే దివ్యాంగులకు సైతం రాష్ట్ర వ్యాప్తంగా ఉచిత బస్‌ప్రయాణం కల్పించాలని డిమాండ్ చేశారు. ఏ పథకం చేపట్టినా 5శాతం తగ్గకుండా దివ్యాంగులకు కేటాయించాలని కోరారు.

## మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభం




మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రారంభిస్తున్న డీఎం, పట్టణ, రూరల్ సీఐలు

వేములవాడ రూరల్, డిసెంబర్ 9: మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కార్యక్రమాన్ని శనివారం వేములవాడ మున్సిపల్ పరిధిలోని తిప్పాపూర్ బస్టాండ్‌లో డిపో మేనేజర్ మురళీకృష్ణ ప్రారంభించారు. మహిళలు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఇక్కడ పట్టణ, రూరల్ సీఐలు కరుణాకర్, కృష్ణకుమార్, వేములవాడ డిపో మేనేజర్ ఉన్నారు.

## గోపా నాయకుల సంతాపం

రాయికల్, డిసెంబర్ 9: పట్టణానికి చెందిన సీనియర్ పాత్రికేయుడు ముంజ ధర్మపురి ఇటీవల మృతి చెందగా, శనివారం గోపా మండల శాఖ ఆధ్వర్యంలో సంతాపం తెలిపారు. బాధిత కుటుంబానికి రూ.5వేల ఆర్థిక సాయం చేశారు. ఇక్కడ మండలాధ్యక్షుడు బత్తిని నిరంజన్ గౌడ్, ప్రధాన కార్యదర్శి పోతుగంటి సురేశ్‌గౌడ్, కోశాధికారి రాముగౌడ్ ఉన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో
# గులాబీ జెండా ఎగురవేయాలి

- ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలి
- చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్



సమావేశంలో మాట్లాడుతున్న చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

కొడిమ్యాల, డిసెంబర్ 9 : రాబోయే స్థానిక సంస్థలు, ఎంపీ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగురవేయాలని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ సూచించారు. శనివారం నాచుపల్లి గ్రామంలో కొడిమ్యాల, మల్యాల మండలాల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో కష్టపడిన పనిచేసిన కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. పది సంవత్సరాలుగా బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించినట్లు చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గులాబీ జెండా ఎగుర వేయడానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో రెండు మండలాల సర్పంచుల ఫోరం అధ్యక్షులు పునుగోటి కృష్ణారావు, మిట్టపల్లి సుదర్శన్, సింగిల్ విండో చైర్మన్లు మేన్నేని రాజనర్సింగారావు, అయిల్నేని సాగర్‌రావు, బోయిన్‌పల్లి బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కత్తెరపాక కొండయ్య, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక చేయూత

మల్యాల, డిసెంబర్ 9 : తక్కళ్లపల్లి గ్రామానికి చెందిన నిరుపేద దూల హన్మయ్యకు రెండు కిడ్నీలు చెడిపోవడంతో వైద్య ఖర్చుల నిమిత్తం మల్యాలకు చెందిన సామాజిక సేవకులు గుండేటి రవితేజ, సంతోష్ రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. అలాగే కుటుంబానికి అవసరమైన నిత్యావసర సరుకులతో పాటూ 25 కిలోల బియ్యాన్ని విరాళంగా అందజేశారు. ఇక్కడ ముత్యం శంకర్, పొన్నం సాయి, ఉంగరాల గణేశ్, చందు, మని, రాఘువేంద్ర, రాజు, నవీన్, మహేశ్, భరత్ ఉన్నారు.